సాక్షి ఒడిశా


ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,45,809లు, వెండి 16.7 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



మిన్నంటిన పానా సంబరాలు
- 8లో



వేటకు విరామం
● ఒడిశా తీరం వెంబడి 2నెలలు చేపల వేట నిషేధం
- 8లో

న్యూస్‌రీల్

గజపతిలో వడగాల్పులు



నిర్మానుష్యంగా ఉన్న పర్లాకిమిడి జైలు రోడ్డు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో వడగాల్పుల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్నాయి. గత 3రోజులుగా పగటిపూట ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు పైగా నమోదవుతుండగా.. శనివారం కూడా అదే వేడిమి కొనసాగింది. రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు ఈనెల 20 వరకు సెలవులు ప్రకటించగా, ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకూ పని చేస్తున్నాయి. మరోవైపు ప్రజలు ఉదయం 10గంటల తరువాత బయటకు రావాలంటే భయపడుతున్నారు. వడగాల్పుల వల్ల భవన నిర్మాణ కార్మికులు మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు పనులు నిలుపుదల చేయాలని జిల్లా కార్మిక ఉపాధిశాఖ అధికారి లోకనాథ పండా ఆదేశాలు జారీ చేశారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న చైతన్య సమితి సభ్యులు

పర్లాకిమిడి: పట్టణంలోని మార్కెట్ జంక్షన్‌లో శ్రీరామ మందిరం ఆవరణలో మహావిషువ సంక్రాంతి సందర్భంగా చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఎండ తీవ్రత నుంచి బాటసారులకు ఉపశమనంగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు చైతన్య సమితి కార్యదర్శి బర్నాల జగన్నాథరావు తెలిపారు. కార్యక్రమంలో చైతన్య సభ్యులు పొట్నూరు హరి, పోలిశెట్టి, జి.నానాజీ, మురళీ బెహరా, ఐ.వెంకట్రావు, ఎర్రా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేడీ మాజీ ఎమ్మెల్యేపై ఈడీ ఛార్జిషీట్



ఆనం నాయక్

భువనేశ్వర్: మనీలాండరింగ్ నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ) కేసులో బీజేడీ మాజీ ఎమ్మెల్యే ఆనం నాయక్‌కు వ్యతిరేకంగా నేరారోపణ చిట్టా దాఖలు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) శనివారం తెలిపింది. నాయక్‌తో పాటు మరికొంత మందిపై భువనేశ్వర్‌లోని ప్రత్యేక పీఎంఎల్‌ఏ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసినట్లు కేంద్ర దర్యాప్తు సంస్థ తెలిపింది. దీనిపై గురువారం కోర్టు విచారణ చేపట్టింది. కొరాపుట్ విజిలెన్స్ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. ఒడిశాలోని కోరాపుట్‌లో రూ.1.54 కోట్ల విలువైన ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారని నిందిత ఎమ్మెల్యే ఆనమ్‌పై ఆరోపణలు వచ్చాయి. అక్రమ ఆస్తులు ఆర్జించినట్లు విచారణలో తేలింది. వీటిలో రూ.1.52 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ ఇప్పటికే తాత్కాలికంగా అటాచ్ చేసింది. ఈ ప్రక్రియని న్యాయవ్యవస్థ ధ్రువీకరించింది. వివిధ స్థిరాస్తులు సంపాదించడంతోపాటు తన పేరుపై, కుటుంబ సభ్యుల పేరిట బ్యాంకుల్లో పెట్టుబడులు ఉన్నట్లు గుర్తించారు.

అన్నదమ్ముల అదృశ్యంపై కేసు నమోదు



జయంత బిశ్వాల్, సుబ్రత బిశ్వాల్

జయపురం: ఒక కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు జయపురం సదర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ శంకర పండా శనివారం వెల్లడించారు. పోలీసుల వివరణ ప్రకారం టంకువ పంచాయతీ జగన్నాథ్‌పూర్ సమీపంలోని ఝింఖరగుడ గ్రామానికి చెందిన సుశాంత బిశ్వాల్ కుమారుడు జయంతి బిశ్వాల్(15), అతడి సోదరుడి కుమారుడు సుబ్రత్ బిశ్వాల్(17) ఈనెల 10న ఇంటి నుంచి బయటకు వెళ్లారు. అయితే సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో బంధువులు, స్నేహితులకు ఫోన్ చేయగా, ఆచూకీ లభించలేదు. ఈ నేపథ్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. జయంతి జయపురంలోని ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతుండగా, సుబ్రత్ స్థానిక కళాశాలలో ప్లస్2 చదువుతున్నాడు. బాలల ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

వేడెక్కిన ‘ఉప’ పోరు

● ఝార్సుగుడ ఉప ఎన్నికకు ప్రధాన పార్టీల సమాయత్తం
● కాంగ్రెస్ అభ్యర్థిగా తరుణ్‌పాండే నామినేషన్ దాఖలు
● సీఎం నవీన్ చేతుల మీదుగా దీపాలి దాస్‌కు బీజేడీ టిక్కెట్





నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి తరుణ్‌పాండే

భువనేశ్వర్: రాష్ట్రంలోని ఝార్సుగుడ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు జాతీయ ఎన్నికల సంఘం అధికారిక ఉత్తర్వులు జారీ చేయడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. మే 10న పోలింగ్ జరగాల్సి ఉండగా.. ప్రధాన పార్టీలు పోటీపోటీగా సమాయత్తం అవుతున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థిగా తరుణ్‌పాండే శనివారం నామినేషన్ దాఖలు చేశారు. పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలతో కలిసి భారీ ఊరేగింపుగా వెళ్లిన ఆయన.. ఝార్సుగుడ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం చేరుకొని, నామినేషన్ పత్రాలను అందచేశారు. ఊరేగింపులో ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్, జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి, బిజయ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. ‘నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు అత్యధికంగా ప్రజల మద్దతు ఉంది. నిరుద్యోగ సమస్య, తాగునీటి ఎద్దడి ఈ ప్రాంతంలో దీర్ఘకాల సమస్యలు. ఈ వేధింపులతో స్థానికులు అధికార బీజేడీ పాలనతో విసిగిపోయా’రని పీసీసీ చీఫ్ శరత్ పట్నాయక్ వ్యాఖ్యానించారు. ఓటర్ల మద్దతు లభిస్తుందని తరుణ్‌పాండే ఆశాభావం వ్యక్తం చేశారు. కాలుష్యం, తాగునీటి కొరత, స్థానికులు ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యల నివారణే అజెండాగా ఉప ఎన్నికలో పోరాడనున్నట్లు తెలిపారు. ఆయన గత నెలలో మరణించిన ఝార్సుగుడ మాజీ ఎమ్మెల్యే బీరెన్ పాండే కుమారుడు.



సీఎం నవీన్ చేతుల మీదుగా బీఫాం అందుకుంటున్న దీపాలి దాస్



టొంకొధొరొ త్రిపాఠి, బీజేపీ అభ్యర్థి

13న ఓట్ల లెక్కింపు..

బిజూ పట్నాయక్ హయాంలోనే ఝార్సుగుడ జిల్లా ఏర్పడిందని దీపాలి దాస్ గుర్తుచేశారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నేతృత్వంలో ఎయిర్‌పోర్టు వచ్చిందని, ఈ ఏడాది చివరి నాటికి ఇంటింటికీ తాగునీరు అందించేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. మహిళా సాధికారతలో ముఖ్యమంత్రి పాత్ర అత్యంత కీలకంగా పేర్కొన్నారు. ఏప్రిల్ 13న ప్రారంభమైన ఉప ఎన్నిక నామినేషన్ ప్రక్రియ ఏప్రిల్ 20న ముగియనుంది. పోలింగ్ మే 10న, ఓట్ల లెక్కింపు అదేనెల 13న జరగనున్నాయి. ఈనెల 17న భారతీయ జనతాపార్టీ అభ్యర్థి టొంకొధొరొ త్రిపాఠి, 18న బిజూ జనతాదళ్ అభ్యర్థిగా దీపాలి దాస్ ఝార్సుగుడ ఉప ఎన్నికలో పోటీ చేసేందుకు నామినేషన్లు దాఖలు చేయనున్నట్లు సమాచారం.



నవీన్ నివాస్ బయట బీఫాంను ప్రదర్శిస్తున్న దృశ్యం

ప్రభుత్వ పథకాలే బలం..

ఝార్సుగుడ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికకు బిజూ జనతాదళ్(బీజేడీ) అభ్యర్థి దీపాలిదాస్ బిజూ జనతాదళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ చేతుల మీదుగా శనివారం పార్టీ టికెట్ అందుకున్నారు. ఆమె హత్యకు గురైన మంత్రి నవకిశోర్ దాస్ కుమార్తె. కిశోర్ దాస్ హత్యతో ఝార్సుగుడ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో ఆయనకు వారసురాలిగా కుమార్తెను ప్రకటిస్తూ నవీన్ పట్నాయక్ శనివారం అధికారికంగా టిక్కెట్ అందజేశారు. సీఎం ఆశీర్వాదంతో విజయం సాధించడంతో పాటు గర్వపడేలా పని చేస్తానని దీపాలి దాస్ ప్రకటించారు. టికెట్ అందుకున్న సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆమె.. ఉప ఎన్నికలో ఉత్తమ ఫలితాలను ఆశిస్తున్నట్లు తెలిపారు. బీజేడీ వైస్ ప్రెసిడెంట్ దేవీప్రసాద్ మిశ్రా, ఆమె సోదరుడు విశాల్‌తో కలిసి నవీన్ నివాస్ సందర్శించి, టికెట్ అందుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలో తనకు అనుకూలంగా పోలయ్యే ఓట్ల ఆధిక్యత ఖచ్చితంగా తెలియకున్నా.. బీజేడీ చేపట్టిన ప్రజాహిత కార్యకలాపాల బలంతో మంచి ఫలితం వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సామాన్య ప్రజల కోసం ఎంతో చేస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి లేదని చెబుతున్న వారిని కళ్లున్నా చూడలేని వారిగా వ్యాఖ్యానించారు.

వికృత విశ్వాసం!

● శునకంతో బాల్య వివాహాలు జరిపించిన గ్రామస్తులు
● తొలి దంతం పై వరుసలో మొలిస్తే అరిష్టమంటూ ప్రచారం

భువనేశ్వర్: విద్య, వైజ్ఞానికతతో దూసుకుపోతున్న సమాజంలో ఇంకా మూఢ నమ్మకాలు కొనసాగుతున్నాయి. సంప్రదాయ ముసుగులో అంధ విశ్వాసాల ఆచరణ యథేచ్ఛగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో పలు వింతలు, విడ్డూరాలు వర్ధమాన సమాజంలో వెలుగు చూస్తున్నాయి. ఇటువంటి వింత ఆచారం బాలాసోర్ జిల్లాలో తాజాగా వెలుగులోకి వచ్చింది. కుక్కతో బాల్య వివాహం చేస్తే బాలారిష్టాలు తొలగి పోతాయని ఇరువురు బాలలకు వివాహం జరిపించారు. సంప్రదాయ గిరిజన సమాజంలో పసి పిల్లలకు తొలి దంతం/పన్ను పైవరుసలో మొలిస్తే అరిష్టంగా పరిగణిస్తారు. ఈ అరిష్టం తొలగించేందుకు ఆ బాలుడు లేదా బాలికను కుక్కతో పెళ్లి జరిపించడం ఆచారంగా కొనసాగుతోంది. బాలలకు పైవరసలో తొలి దంతం మొలిస్తే పలు రకాల వ్యాధులు వేధిస్తాయని ఈ వర్గం ఆందోళన. పిల్లల్లో ఈ బాలారిష్టం తొలగించేందుకు కుక్కతో పెళ్లి జరిపిస్తే రోగాలు, వ్యాధులు తొలగి.. పెళ్లి జరిపించిన శునకానికి సంక్రమించి, మరణిస్తుందని నమ్మకం. దీంతో బాలలు జీవితకాలం ఆరోగ్యవంతులుగా చలామణి అవుతారని సంప్రదాయ గిరిజన వర్గం ప్రగాఢ విశ్వాసం. ఈ క్రమంలో బాలాసోర్ జిల్లా సారొ మండలం సింగాఖుంటా పంచాయతీ బొంధొసాహి గ్రామంలో ఇద్దరు బాలలకు తొలి దంతంపై చిగుళ్లపై మొలిచాయి. వీరివురినీ అవాంఛిత రోగ పీడల నుంచి సంరక్షించేందుకు రెండు కుక్కలతో వేర్వేరుగా బాల్య వివాహం వైభవంగా నిర్వహించారు.



వివాహానికి సిద్ధమైన శునకంతో బంధువర్గం

సంప్రదాయ ఆచారాలతో పెళ్లి..

బొంధొసాహి గ్రామంలో మధువాసింగ్ కుమారుడు, మానస్‌సింగ్ కుమార్తెకి తొలి దంతంపై చిగుళ్లపై మొలిచింది. ఈ ఇరువురు బాలలకు కుక్కతో పెళ్లి జరిపించారు. మధువా సింగ్ కుమారుడికి ఆడ కుక్క, మానస్‌సింగ్ కుమార్తెకు మగ కుక్కతో పెళ్లి వేడుకగా జరిపించారు. పెళ్లి తంతును సంప్రదాయ రీతుల్లో అత్యంత ఆనందోత్సాహాలతో జరిపించారు. గ్రామంలో 7 కుటుంబాలకు చెందిన సభ్యులు పసుపు, ఆవాలు, మరుగునీళ్లతో పెళ్లి వారింటికి చేరారు. ఈ బృందంతో కలిసి వధూవరుల కుటుంబీకులు గ్రామం నాలుగు దిక్కుల కూడలి ప్రాంతానికి చేరారు. ఈ కుటుంబాల సభ్యులు తీసుకువచ్చిన మరుగునీటితో బాలలకు స్నానం చేయించారు. ఆభరణాలతో అలంకరించి పెళ్లికి సిద్ధం చేశారు. ఈ తంతు ముగియడంతో శునక వధూవరులను పెళ్లి వేదిక ప్రాంగణానికి ఆర్భాటంగా అలంకరించి తీసుకు వచ్చారు. కుక్క చీలమండకు సంప్రదాయ సూత్రం తొడిగి పెళ్లి జరిపించారు.



కుక్కతో బాలిక వివాహం జరిపిస్తున్న పెద్దలు

కుక్కకు కాలం చెల్లినట్లే..!

ఇలా బాలలతో పెళ్లి చేసుకున్న శునక వధూవరులకు కాలం చెల్లినట్లే. పెళ్లి జరిగిన కొంత కాలానికి బాలలతో పెళ్లి జరిపించుకున్న కుక్కలు పలు రకాల రోగాల బారినపడి చనిపోతాయని స్థానికుల విశ్వాసం. ఇవి చనిపోవడంతో కుక్కలను పెళ్లాడిన బాలలకు సకల అరిష్టాలు తొలగిపోయి, జీవితాంతం ఆనందోత్సాహాలతో బతుకుతారు. ఇదీ శునకంతో బాల్య వివాహం వాస్తవ వృత్తాంతం.

న్యాయం కోరుతూ నిరవధిక ధర్నా



మిల్లు గేటు ముందు ధర్నా నిర్వహిస్తున్న విశ్రాంత శ్రామికులు, కుటుంబాలు

● సేవా పేపరుమిల్లు ముందు భైఠాయించిన శ్రామిక కుటుంబాలు

జయపురం: పట్టణంలోని గగణాపూర్ సేవా పేపరుమిల్లు ప్రధాన గేటు వద్ద రిటైర్డు ఉద్యోగులు, మరణించిన శ్రామికుల కుటుంబాలు నిరవధిక ధర్నాకు దిగారు. మిల్లు యాజమాన్యం చెల్లించాల్సిన గ్రాడ్యూటీ, ఈపీఎఫ్, పింఛన్, బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ కార్మికనేత ప్రమోద్‌కుమార్ మహంతి, సమాజ సేవకుడు బి.హరిరావు, కుని మాఝి, సబిత సాహు, రస్మిత సౌర, ఎస్ఎస్ బెహరా, అజయ బల్, మురళీ బల్, బిజయ దాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రమోద్ మహంతి మాట్లాడుతూ విశ్రాంత శ్రామికులు, మృతిచెందిన వారి కుటుంబాలకు 4నెలలుగా పింఛన్లు, వేతనాలు చెల్లించలేదని వాపోయారు. గత నెల 17న మిల్లు యాజమాన్యం ఇచ్చిన లిఖిత పూర్వక హామీ ఇప్పటికీ అమలు కాలేదని తెలిపారు. యాజమాన్యం ఎటువంటి అనుమతులు తీసుకోకుండా బరంపురం ఈపీఎఫ్ కమిషనర్ కార్యాయంలో కొత్త అకౌంట్ ప్రారంభించారని, దీంతో శ్రామికులు లక్షలాది రూపాయల పీఎఫ్ మొత్తాన్ని పొందలేక పోతున్నారని పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ జోక్యం చేసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



డిమాండ్లు ప్రదర్శిస్తున్న విశ్రాంత శ్రామికులు

దివ్యాంగులకు బ్యాటరీ వాహనాల పంపిణీ



ప్రభుత్వం అందజేసిన వాహనాలతో దివ్యాంగులు, అధికారులు, సస్మితా

కొరాపుట్: జిల్లా పలువురు దివ్యాంగులకు ఉచితంగా బ్యాటరీ స్కూటీలను శనివారం పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని దివ్యాంగుల పునరావాస కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలకా లబ్ధిదారులకు వాహనాల తాళాలు, ధ్రువపత్రాలు అందజేశారు. కొరాపుట్, బొరిగుమ్మ, కుంద్రా, లమతాపుట్, పొట్టంగి, సెమిలిగుడ, జయపురం సమితులు, జయపురం, సునాబెడా, కొట్‌పాడ్ పురపాలక సంఘాలకు చెందిన 23మందికి స్కూటర్లతో పాటు 9మందికి బ్యాటరీతో నడిచే కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఎం రాజేంద్ర మాఝి, జిల్లా సామాజిక భద్రతా అధికారి సిమరాజ మహాపాత్రొ, దిలీప్‌కుమార్ హియాల్, జగన్నాథ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భార్యను చంపిన భర్త



పోలీసుల అదుపులో నిందితుడు మోతిరాయ్ సోడి

మల్కన్‌గిరి: కట్టుకున్న భర్తే భార్యను కిరాతకంగా హతమార్చిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. జిల్లాలోని మత్తిలి సమితి కర్తాన్‌పల్లి పంచాయతీలో చోటు చేసుకున్న ఈ ఉదంతానికి సబంధించి నిందితుడిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. పూర్తి వివారాలు ఇలా ఉన్నాయి. జటాయిగూడ గ్రామానికి చెందిన మోతిరాయ్ సోడి, దాముని సోడి(31) భార్యభర్తలు. ఇద్దరి మధ్య ఈనెల 10న రాత్రి సమయంలో వాగ్వాదం జరిగింది. దీంతో అంతా పడుకున్న సమయంలో తాడుతో దాముని మెడకు ఉచ్చు బిగించిన మోతిరాయ్.. మృతిచెందిన అనంతరం రేకులో చుట్టి, గ్రామం సమీపంలోని దార్లీ నది ఒడ్డున ఇసుకలో పాతిపెట్టాడు. తరువాత ఏమీ తెలియనట్లు ఇంటికి తిరిగి వచ్చేశాడు. వారి కుమార్తె బసంతి సోడి(13) రెండు రోజుల క్రితం ఇంటికి రాగా, తల్లి కనిపించక పోవడంతో తండ్రిని నిలదీసింది. దీనిపై సమాధానం దాట వేయడంతో బాలిక తాత, కుటుంబ సభ్యులకు విషయాన్ని చేరవేసింది. వారంతా వచ్చి మోతిరాయ్‌ను ప్రశ్నించగా.. తానే దామునిని హతమార్చి, ఇసుకలో పాతి పెట్టినట్లు అంగీకరించాడు. దీనిపై ఫిర్యాదు నమోదు కావడంతో మత్తిలి ఐఐసీ రంజన్‌కుమార్ మాఝి, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీసి, స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మత్తిలి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అలాగే నిందితుడిని అరెస్ట్ చేశారు.

కరపత్రాల పంపిణీపై మీడియా ప్రతినిధుల అభ్యంతరం

జయపురం: అభ్యంత్రకర వాఖ్యలతో కరపత్రాలు పంపిణీ చేసిన పాత్రికేయుడు, కొత్తవీధికి చెందిన కృష్ణచంద్ర సాహు(రుత్తు సాహు)పై జయపురం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలో పని చేస్తున్న మీడియా ప్రతినిధులు, ఉద్యోగులు, సమాచార, పౌర సంబంధాలశాఖ అధికారులపై అభ్యంతకరమైన భాషలో కరపత్రాలు విడుదల చేసి, ప్రజలకు పంపిణీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సాహు, తమ వ్యక్తిగత జీవితాలను కించపరుస్తూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారని, తగిన చర్యలు తీసుకోకపోతే న్యాయ పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. దీనిపై స్పందించిన పోలీసులు.. సమస్యలను జిల్లా ఎస్పీ అభినవ సోంకార్, సబ్ డివిజన్ పోలీసు అధికారి హరీష్ బీసీ దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

● సంబల్‌పూర్‌లో హనుమాన్ ర్యాలీపై దాడిని ఖండించిన వీహెచ్‌పీ



పర్లాకిమిడి: రాజవీధికి చేరుకున్న భజరంగ్‌దళ్ బైక్ ర్యాలీ

జయపురం: సంబల్‌పూర్‌లో హనుమాన్ భక్తులు నిర్వహించిన బైక్ ర్యాలీపై హింసాత్మకంగా జరిగిన దాడిని కొరాపుట్ జిల్లా విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు కారకులైన వారిని వెంటనే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి బాలకృష్ణ బిశ్వాల్, బాబూ షొడంగి, నిలు ప్రధాన్, సుమంత ప్రధాన్, జయరాం గౌరడ, ప్రహ్లాద్ సాహు, భరత్ నాయక్ తదితరులు కలెక్టర్ కార్యాలయ అధికారులకు శనివారం వినతిపత్రం అందించారు. సంబల్‌పూర్‌లోని హనుమాన్ భక్తుల ర్యాలీపై జరిగిన అమానుష దాడికి ప్రధాన కారణం అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతా లోపమేనని ఆరోపించారు. బందోబస్తులో తక్కువ మంది పోలీసులు ఉండటమే దీనికి కారణమన్నారు. ముందస్తు సమాచారం ఉన్నా పూర్తిస్థాయిలో సిబ్బందినిక కేటాయించడంలో అధికారులు విఫలయ్యారని విమర్శించారు. ఆదంతా ధార్మిక విశ్వాసం, స్వతంత్రతపై జరిగిన దాడిగా అభిప్రాయ వ్యక్తంచేశారు. ఘటనపై వెంటనే విచారణ జరిపి, బాధ్యులను వెంటనే అరెస్ట్ చేసి, శిక్షించాలని కోరారు.



జయపురం: కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భజరంగ్ దళ్ బైక్ ర్యాలీ..

పర్లాకిమిడి: జిల్లాలోని రాయఘడ బ్లాక్ లంజిపదర చౌక్‌లో భజరంగ్ దళ్ సభ్యులు బైక్ ర్యాలీ చేపట్టారు. మహావిషువ సంక్రాంతి సందర్భంగా 23కిలోమీటర్ల దూరంలోని లింజిపదర చౌక్ నుంచి రాజవీధి మీదుగా రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించినట్టు సంఘం పట్టణ అధ్యక్షుడు మనోజ్‌కుమార్ దాస్ తెలిపారు. ర్యాలీలో విశ్వహిందూ పరిషద్ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాలిసెట్ ప్రవేశపరీక్షకు ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పాలిసెట్-2023కు ఉచిత శిక్షణ అందించనున్నట్లు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకిరామయ్య శనివారం తెలిపారు. ఈ నెల 17 నుంచి ప్రారంభమయ్యే శిక్షణలో స్టడీ మెటీరియల్ సైతం ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారంతా పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి అండగా..



లలితకుమారికి చెక్ అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : టెక్కలి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఎస్.మల్లేశ్వరరావు విధి నిర్వహణలో ఉండగా గతేడాది రోడ్డు ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం నుంచి ఇన్సూరెన్సు కింద రూ. 21.15 లక్షలు మంజూరు కావడంతో మల్లేశ్వరరావు భార్య ఎస్.లలితకుమారికి శనివారం ఎస్పీ జి.ఆర్.రాధిక చెక్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ వి.ఎస్.మణికంఠ, అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, సహాయ పరిపాలనాధికారిణి శోభారాణి, సూపరింటెండెంట్ బాలరాజు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితం నాశనం




సివిల్ జడ్జిలకు జ్ఞాపికలు అందజేస్తున్న జెమ్స్ సిబ్బంది

శ్రీకాకుళం రూరల్: ర్యాగింగ్ రహిత కాలేజీగా జెమ్స్ వైద్య కళాశాలను తీర్చిదిద్దడం అభినందనీయమని జిల్లా కోర్టు ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి కె.నాగమణి అన్నారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలపై శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీనియర్స్, జూనియర్స్ కలిసిమెలిసి ఉండాలన్నారు. ర్యాగింగ్ వంటి అనైతిక చర్యలకు పాల్పడి జీవితం నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో అడిషినల్ సివిల్ జడ్జి ఎం.అనూరాధ, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీలలిత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజీవరావు, పీజీ కోఆర్డినేటర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం

లావేరు: అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని వయోజన విద్యాశాఖ ఉప సంచాలకుడు ఎం.వెంకటరమణ, సహాయ ప్రాజెక్టు అధికారి బి.బాలచందర్ అన్నారు. మండలంలోని జీజీవలసలో శనివారం అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిరక్షరాస్యులకు లిటరసీ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరినీ అక్షరాస్యులుగా చేయడమే కార్యక్రమ ఉద్దేశమన్నారు. ఎంఈఓ ఎల్.ఈశ్వరరావు, వార్డు మెంబరు ఎస్.దుర్గారావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెరగాలి



వేణుగోపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, సంస్థల నుంచి పోటీ తట్టుకోవాలంటే ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో మెరుగైన విద్యా ప్రమాణాలు అమలు చేయాలని ఉన్నత విద్యా మండలి పూర్వపు చైర్మన్, ఏయూ పూర్వపు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎల్.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ఎచ్చెర్లలోని అంబేద్కర్ వర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో శనివారం మేనేజ్‌మెంట్ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్సు రిలీవ్ అయ్యే నాటికి శతశాతం విద్యార్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునేలే విద్యలో మార్పులు అవసరమని చెప్పారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, విషయ పరిజ్ఞానం, పారిశ్రామిక అవసరాలకు అనువైన అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఇన్‌టర్న్‌షిప్ వంటివి అమలు చేయటం వల్ల నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. అంబేద్కర్ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మాట్లాడుతూ ఉపాధికి తగ్గ కోర్సులు నిర్వహణ, సిలబస్ మార్పు వంటి అంశాలకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ బిడ్డిక అడ్డయ్య, హానరీ ప్రొఫెసర్ తమ్మినేని కామరాజు, కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ కూన అచ్యుతరావు పాల్గొన్నారు.

మిన్నంటిన పొనా సంబరాలు



మజ్జిగౌరి అమ్మవారిపై చిత్రీకరించిన హారతి వీడియాను ఆవిష్కరిస్తున్న నెక్కంటి

- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉర్రూతలూగించిన గాయనీ, గాయకులు

రాయగడ: పట్టణంలో పొనా సంక్రాంతి సందర్భంగా తేజస్వినిగ్రౌండ్, గోవిందచంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. ఒడియా ప్రజల సంస్కృతికి అద్దం పట్టే ఈ పొనా ఉత్సవాలు మిన్నంటాయి. రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక, కొరాపుట్ లోక్‌సభ సభ్యుడు సప్తగిరి ఉలక దంపతులు, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పండా, గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన కార్యక్రమాలకు హాజరయ్యారు. రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు, మాజీమంత్రి లాల్‌బిహారి హిమిరిక తదితర ప్రముఖులు హోటల్ తేజస్విని గ్రౌండ్‌లో జరిగిన ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ ఏడాది ఉత్సవాలు మూడు ప్రాంతాల్లో మూడు వేదికల్లో జరగడం విశేషం.

హారతి వీడియో ఆవిష్కరణ..

ఉత్కళ ప్రజల ఆరాధ్యదైవం మజ్జిగౌరి అమ్మవారిపై ప్రత్యేకంగా చిత్రీకరించిన సంధ్యా హారతి వీడియోను ఈ సందర్భంగా తేజస్విని గ్రౌండ్‌లో జరిగిన ఉత్సవాల్లో రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీర్వాదాలు ఎల్లవేళలా ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. రాయగడలో ఎంతోమంది కళాకారులు తమ ప్రతిభను కనబరుస్తున్నారని, లఘుచిత్రాల నిర్మాణాలతో పాటు ఇటువంటి వీడియో లను రూపొందించడం అభినందనీయమన్నారు. ఒడియా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన.. మన భాష, సంస్కృతులను పరిరక్షించే విధంగా అంతా కలసికట్టుగా కృషి చేయాలని సూచించారు. పొనా సంక్రాంతి అందరి పండగగా అభివర్ణించారు. ఎన్ని వేదికల్లో సంబరాలు జరిగినా.. మన సంస్కృతిని మరువకూడదని హితవు పలికారు. కొద్ది రోజుల క్రితం జరిగిన తెలుగువారి పండగ ఉగాదికి కూడా ప్రజలు నీరాజనాలు పలికారని గుర్తుచేశారు. ఒడియా-తెలుగు ప్రజల సమ్మేళనంగా ప్రతి పండగను సంయుక్తంగా జరుపుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇదే సంప్రదాయాన్ని పాటిస్తూ భావితరాలు ముందుకు వెళ్లాలని అభిప్రాయం వ్యక్తంచేశారు.



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భజన గీతాలు ఆలపిస్తున్న రవినారాయణ దాస్

అలరించిన గీతాలు..

ప్రముఖ కళాకారుడు రవినారాయణ దాస్, మానసీ పాత్రో ఆలపించిన భజన గీతాలు ప్రేక్షకులను రంజింపజేశాయి. అదేవిధంగా బాలీవుడ్ గాయకులు హర్ష్ మహ్మద్, తారిక్ అజీజ్ పాటలు యువతను ఉర్రూతలూగించాయి. ఒలీవుడ్ గాయని దీప్తిరేఖ ఒడియా, హిందీ ఆధునిక గీతాలతో అలరించారు. స్థానిక కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అందరి మనసులను ఆకట్టుకున్నాయి.



సంబరాలను తిలకిస్తున్న మంత్రి సరక, ఎమ్మెల్యే ముదులి



హాజరైన ఎంపీ సప్తగిరి దంపతులు, డీసీసీ అధ్యక్షుడు పండా



తేజస్విని మైదానంలో సంబరాలకు విచ్చేసిన ప్రజలు

వేటకు విరామం

- ఒడిశా తీరం వెంబడి 2నెలలు చేపలవేట నిషేధం
- సంప్రదాయ మత్స్యకారులకు మాత్రం మినహాయింపు



భువనేశ్వర్: సంతానోత్పత్తి కాలంలో సముద్రంలో చేపల నిల్వను సంరక్షించే ప్రయత్నంలో, ఒడిశా ప్రభుత్వం శనివారం నుంచి రాష్ట్ర తీరంలో చేపల వేటపై 2నెలల నిషేధం విధించింది. రాష్ట్రంలో 450 కిలోమీటర్లకు పైగా తీరప్రాంతం విస్తరించి ఉంది. ఒడిశా మెరైన్ ఫిషింగ్ రెగ్యులేషన్ చట్టంలోని నిబంధనల ప్రకారం, రాష్ట్రప్రభుత్వం ఈనెల 15 నుంచి జూన్ 14వరకు 61 రోజులు చేపల వేట నిషేధించింది. సంప్రదాయ చేపల వేట పడవలకు 8.5 మీటర్ల పొడవైన ఓడలకు మినహాయింపు కల్పించారు. వర్షాకాలంలో చేపల వేటపై నిషేధం మొదటిసారిగా 1998లో విధించారు. నిషేధ ఉత్తర్వులు కట్టుదిట్టంగా అమలు చేయాలని మత్స్యశాఖ డైరెక్టరేట్ గంజాం, కుజంగ్, బాలాసోర్, పూరీ ప్రాంతాల అదనపు మత్స్యశాఖ అధికారులు, బలుగాంవ్ జిల్లా మత్స్య అధికారులకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో అన్ని అనుబంధ వర్గాలకు తెలియజేయాలని తెలిపింది. ఒడిశా తీరం వెంబడి ఏకరీతి నిషేధంపై సముద్ర మత్స్యకారులకు అవగాహన కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొంది. సంతానోత్పత్తి కాలంలో ట్రాలర్ ఫిషింగ్ కారణంగా కలిగే అవాంతరాలను నివారించడానికి, ఒడిశా మెరైన్ ఫిషింగ్ రెగ్యులేషన్ యాక్ట్-1982లోని సెక్షన్-4 ప్రకారం 'ఫిషింగ్ బ్యాన్' కాలంలో సముద్రంలోకి వెళ్లవద్దని మత్స్యకారులకు సూచించినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

సంతానోత్పత్తి కాలంలో..

రాష్ట్రంలోని మత్స్యశాఖలో 2000 ట్రాలర్లతో దాదాపు 21,000 ఫిషింగ్ ఓడలు నమోదైనట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. నిషేధం సమయంలో, యాంత్రిక చేపలవేట ఓడలు సముద్రంలోకి వెళ్లడానికి అనుమతించరు. 8.5 మీటర్ల కంటే తక్కువ పొడవు ఉన్న చిన్న మెకనైజ్డ్, నాన్ మెకనైజ్డ్ బోట్లకు పెద్ద ఖాళీలున్న వలలను మినహాయించినట్లు వివరించారు. వర్షాకాలం ఒడిశా తీరంలో రుచికరమైన హిల్సాతో సహా దాదాపు 300జాతుల చేపల సంతానోత్పత్తి కాలంగా పరిగణిస్తారు. సంప్రదాయ మత్స్యకారులకు చేపలవేట నిషేధం నుంచి మినహాయింపు ఇచ్చారు. అయినప్పటికీ, వారు ప్రాంతీయ జలాల్లో మాత్రమే చేపలు పట్టడానికి, నిర్ధారిత చేపలను మాత్రమే వేటాడేందుకు అనుమతించారు.

క్రైమ్ కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఇచ్ఛాపురం: జాతీయ రహదారి-16పై బెల్లుపడ - ఈదుపురం కూడలిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బెల్లుపడ గ్రామానికి చెందిన తిప్పన బైరయ్య(33) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెల్లుపడ అనపాన వీధికి చెందిన తిప్పన బైరయ్య నెల్లూరులో వెల్డింగ్ పనులు చేసేవాడు. గ్రామదేవత ఉత్సవాల కోసం స్వగ్రామం వచ్చాడు. బంధువులకు ఆహ్వానం పలికేందుకు ఈదుపురం బైకుపై వెళ్లి తిరిగి వస్తుండగా పలాస వైపు నుంచి బరంపురం వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. పట్టణ ఎస్‌ఐ కె.గోవిందరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని తండ్రి మోహనరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం బోల్తాపడటంతో..

జలుమూరు : రావిపాడు సమీపంలో మలుపు వద్ద ద్విచక్ర వాహనం బోల్తా పడిన ఘటనలో అదే గ్రామానికి చెందిన సాగి దాలప్పడు (78) శుక్రవారం రాత్రి రిమ్స్‌లో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వైద్య పరీక్షలు చేసుకునేందుకు కుమారుడు శ్రీనివాసరావుతో కలిసి నరసన్నపేట వెళ్లి తిరుగు వస్తున్న క్రమంలో రోడ్డు మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయారు. ఈ ఘటనలో దాలప్పడు తలకు బలమైన గాయమైంది. వెంటనే 108లో రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు పోలీస్‌లు తెలిపారు. అల్లుడు సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని

లావేరు: రావివలస సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఎం.రవీంద్రన్ పిళ్లై(52) అనే వ్యక్తి మృతి చెందాడు. లావేరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామానికి చెందిన రవీంద్రన్ పిళ్లై పని నిమిత్తం రణస్థలం వచ్చాడు. శుక్రవారం రాత్రి రావివలస వైపు నుంచి రణస్థలం వైపు జాతీయ రహదారి పక్కన నడుచుకొని వెళుతుండగా శ్రీకాకుళం నుంచి రణస్థలం వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది.

శాంతి స్వరూపిణి..స్వేచ్ఛావతి

- రేపటి నుంచి ఇచ్ఛాపురం స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలు
- పదేళ్ల తర్వాత ప్రారంభమవుతున్న పండగ
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

ఇచ్ఛాపురం: శాంతిస్వరూపిణి, కోర్కెలు తీర్చే కల్పవల్లి ఇచ్ఛాపురం గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలకు వేళయ్యింది. పదేళ్ల తర్వాత జరిగే ఈ పండగల కోసం ఆలయ అభివృద్ధి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, బెంగాల్, బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకుంటారు.

చారిత్రక నేపథ్యం..

29 రోజులకు తక్కువ కాకుండా నిర్వహించే ఈ ఉత్సవాలకు సుమారు 200 ఏళ్ల చరిత్ర ఉంది. పూర్వం ఈ ప్రాంతమంతా ఒడిశారాజు సురంగి రాజావారి ఆధీనంలో ఉండేవి. స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం వెలసిన ప్రాంతమంతా పంట పొలాలు, తోటలు, దట్టమైన చెట్లతో నిండి చిన్నపాటి అరణ్యాన్ని తలపించేది. పదుల సంఖ్యలో ఇళ్లతో చిన్న గ్రామంగా ఉండేది. అందరూ వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించేవారు. ఈ క్రమంలో గిలాయి చిన్నయ్య అనే రైతు తన పంట పొలంలో కాడెద్దుల సహాయంతో దున్నుతున్న సమయంలో నాగలిలో పొలంలో ఇరుక్కుపోయింది. ఎంత ప్రయత్నించిన బయటకి రాకపోవడంతో చుట్టుపక్కల వారికి విషయం చెప్పి నాగలి బయటికి తీయడానికి సహాయం చేయమని కోరారు. అందరూ కలిసి నాగలిని తీయడానికి ప్రయత్నిస్తుండగా ఆ ప్రాంతం నుంచి రక్తం నేలపైకి ఉబికి రావడంతో అందరూ భయాందోళనకు గురయ్యారు. అదే రోజు రాత్రి చిన్నయ్య కలలో అమ్మవారు తేజోవంతంగా కనపడి నాగలి ఇరుక్కుపోయిన ప్రాంతంలో స్వేచ్ఛావతి మాతగా ఆవిర్భవిస్తున్నానని, తనకు గుడికట్టాలని చెప్పి అంతర్ధానమైంది. మరుసటి రోజు వెళ్లి పూజలు చేసి తవ్వి చూడగా అమ్మవారు బయటపడ్డారు. అదే ప్రాంతంలో చిన్న పాకవేసి మొదట్లో రైతు కుటుంబీకులు పూజలు చేశారు, తరువాత గిలాయి వంశీయులు పూజలు చేయడం, కాలక్రమేణా గ్రామదేవతగా ప్రసిద్ధిచెందింది. ఈ అమ్మవారి పేరుమీదనే స్వేచ్ఛాపురం గ్రామం ఏర్పడింది. కాలక్రమేణా స్వేచ్ఛాపురం కాస్త ఇచ్ఛాపురంగా రూపాంతరం చెందింది.



ఆకట్టుకున్న విద్యుత్ అలంకరణ

2013 తర్వాత మళ్లీ..

అమ్మవారి ఉత్సవాలు పూర్వం నుంచి 29 రోజులకు తక్కువ కాకుండా జరిగేవి. 1976లో ఉత్సవాలు జరిగిన తరువాత 25 ఏళ్లు నిర్వహించలేదు. 2001లో మళ్లీ ప్రారంభం కాగా, 2013లో చివరిసారిగా ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించారు.

ఉత్సవాలు జరిగే తీరు..

- ఈ నెల 17న మొదటి పూజ గిలాయి చిన్నయ్య వంశీయులచే ప్రారంభమవుతుంది. అమ్మవారిని గ్రామంలోకి తీసుకొచ్చి ఉప్పల వీధిలో కొలువదీరుస్తారు.
- ఉత్సవాల సమయంలో నందిక వంశీయులతో పాటు వీధిలో ఉన్నవారంతాకలసి కట్టుగా ఏర్పాట్లు చూస్తుంటారు.
- మొదటి 15 రోజులు మున్సిపాలిటి పరిధిలోని 17 వార్డుల్లో తిరువీధి నిర్వహిస్తారు. ఈ సమయంలో రోజుకు 20 వేల మంది భక్తులు పాల్గొంటారని అంచనా.
- 15 రోజుల తర్వాత రథం వీధి, దాసన్న పేట కూడలిలో భక్తుల దర్శనార్థం ప్రత్యేక మండపంలో అమ్మవారిని ఉంచుతారు. ఈ సమయంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. రోజుకు 80వేల మంది పాల్గొనే అవకాశముంది.
- ఉత్సవాలు జరిగే సమయంలో ప్రతి మంగళ, శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.
- మే 1 నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయి.
- మే 15తో వేడుకలు ముగుస్తాయి.
- ఏవైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు, పాదయాత్రలు, ప్రారంభం లేక ముగింపు వంటి కార్యక్రమాలు ఇక్కడే నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.
- మాలీలు(అర్చకులు) ఇచ్చిన సమాచారం మేరకు అమ్మవారు మొత్తం ఐదుగురు అక్కాచెల్లెళ్లు. కురాసిని, స్వేచ్ఛావతి, గారపోలమ్మ, సిద్ధభైరవి, ముత్యాలమ్మ. అందరూ ఉగ్రరూపంలో ఉన్నా స్వేచ్ఛావతి అమ్మవారు మాత్రం శాంతమూర్తి కావడంతో ఇక్కడ పూజలు చేస్తే ప్రశాంతత, విజయం చేకూరుతుందని భక్తుల నమ్మకం.
- 2019లో అమ్మవారి మూలవిరాట్‌గా కృష్ణశిలావిగ్రహాన్ని పునఃప్రతిష్టాపన చేసి పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు.



స్వేచ్ఛావతి అమ్మవారు



ఉత్సవాలకు సిద్ధమైన ఆలయం

పకడ్బందీగా ఏర్పాట్లు..



స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి నిత్యం వార్డుల్లో శానిటేషన్ పనులు చేసేందుకు సిబ్బందిని షిఫ్టుల రూపంలో నియమించాం. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– పిలక రాజలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్


ఉత్సవాలకు ఆహ్వానం



స్పీకర్ తమ్మినేనికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాలకు హాజరుకావాలని కమిటీ ప్రతినిధులు శనివారం స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు సీదిరి అప్పలరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్‌కు ఆహ్వాన పత్రికలు అందజేశారు. శ్రీకాకుళంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్కలోకేశ్వరరావు, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు ఆదిరెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు అన్వేష్, నాయకులు ప్రకాశపట్నాయక్ పాల్గొన్నారు.

చిత్రకారిణి ప్రమీళారాణికి సత్కారం



సీఎం జగన్ చిత్రాన్ని కృష్ణదాస్‌కు అందిస్తున్న ప్రమీళారాణి

పోలాకి: భావనపాడు పోర్టుకు శంకుస్థాపన చేయనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ప్రకాశరావుపేటకు చెందిన చిత్రకారిణి సంపతిరావు ప్రమీళారాణి ముఖ్యమంత్రి స్కెచ్‌ను అద్భుతంగా గీసింది. ఈ చిత్రాన్ని గీచి వరల్డ్ ఆర్టిస్ట్‌డే సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు శనివారం మబగాంలోకి ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేసింది. ఈ సందర్భంగా ప్రమీళారాణిని సన్మానించారు. జిల్లాకు వస్తున్న సీఎంకు చిత్రాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రమీళారాణి 2023 ఇండియన్ ఐకాన్-యంగ్ స్కెచ్ అవార్డును సైతం దక్కించుకుంది.

క్లుప్తంగా

గోళ్లవలసలో గజరాజుల గుంపు



గోళ్లవలస గ్రామంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

కురుపాం: మండలంలోని గుమ్మిడిగూడ పంచాయతీ గోళ్లవలస గ్రామంలో గజరాజులు గుంపు తిష్ట వేసింది. దీంతో గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కొమరాడ మండలం నుండి శుక్రవారం అర్ధరాత్రి కురుపాం మండలం గోళ్లవలస గ్రామంలోకి మొత్తం ఏనుగుల గుంపు ప్రవేశించి పంటలు ధ్వంసం చేసాయని గ్రామస్తులు తెలిపారు. అర్ధరాత్రి గ్రామంలోకి రావడంతో బిక్కుబిక్కుమంటూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని నిద్ర లేకుండా గడిపినట్లు గ్రామస్తులు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి గ్రామ పరిసరాల నుండి గజరాజులను తరలించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వ్యక్తిపై దాడి

పార్వతీపురం: నిద్రిస్తున్న వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి అవుట్ పోస్టు పోలీసులు శనివారం తెలిపిన వివరాలు... వీరఘట్టం మండలం నడుకూరు గ్రామానికి చెందిన బొత్స శివప్రసాద్‌ను శుక్రవారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన కె.గౌరీ శంకరరావు అకారణంగా కొట్టాడు. ఈ ఘటనలో శివప్రసాద్‌కు తల, ఎడమ చెంప, ఎడమ కాలుపై తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స కోసం 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. దీనిపై అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య



శ్రీలక్ష్మి మృతదేహం

రాజాం సిటీ: స్థానిక కాలెపువీధిలో నివాసం ఉంటున్న పడాల శ్రీలక్ష్మి (28) శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించి శనివారం కేసు నమోదు చేసిన ఎస్‌ఐ నీలావతి వివరాలు వెల్లడించారు. విజయనగరానికి చెందిన శ్రీలక్ష్మి 10వ తరగతి వరకు చదువుకుని డ్యాన్స్ ఈవెంట్‌లకు యాంకర్‌గా వ్యవహరించేది. ఈ క్రమంలో రాజాంకు చెందిన డ్యాన్సర్ పడాల రాజుతో పరిచయం ఏర్పడింది. ఇది కొన్నేళ్లకు ప్రేమగా మారి గత ఏడాది జూలైలో ఇరువురు వివాహం చేసుకుని రాజాంలో నివాసం ఉంటున్నారు. అప్పటి నుంచి ఎంతో అన్యోన్యంగా ఉంటూ జీవనం సాగిస్తున్నారు. అశోక్ డ్యాన్స్ ప్రోగ్రాంల నిమిత్తం వెళ్లి ఆలస్యంగా రావడం నిర్లక్ష్యం చేస్తున్నాడనే అభద్రతా భావానికి లోనైంది. ఈ క్రమంలో ఈ నెల 14న అర్ధరాత్రి దాటిన తరువాత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఈ విషయాన్ని గమనించిన భర్త తన స్నేహితుని సహాయంతో రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తల్లి శకుంతల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

నాగావళి నదిలో మృతదేహం లభ్యం



నాగావళి నదిలో తేలియాడుతున్న మిరియాల సింహాచలం మృతదేహం

వంగర: మండలంలోని పెదరాజులగుమ్మడ గ్రామానికి చెందిన మిరియాల సింహాచలం (66) మృతి చెందాడు. ఆయన మృతదేహం గ్రామ సమీపంలోని ఓడరేవు వద్ద ఉన్నట్లు స్థానికులు గుర్తించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ బుడుమూరు లోకేశ్వరరావు సంఘటనా స్థలం వద్దకు చేరుకొని నాగావళి నది నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని వెలికి తీసి పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. పెదరాజులగుమ్మడ గ్రామానికి చెందిన మిరియాల సింహాచలంగా గుర్తించారు. ఈ నెల 14వ తేదీ ఉదయం నుంచి తన భర్త కనిపించలేదని, స్నానానికి దిగి ఈత రాకపోవడంతో ఇలా నదిలో కొట్టుకుపోయి మృతి చెంది ఉంటాడని మృతుడు భార్య సరోజనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని రాజాం సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలిస్తున్నట్లు చెప్పారు.

గోదాం అప్పగింత

పూసపాటిరేగ: అక్రమ నిర్మాణమంటూ రెండేళ్ల కిందట అధికారులు కూల్చేసిన హెచ్‌పీ గ్యాస్ గోదామును కోర్టు ఆదేశాలతో తిరిగి నిర్మించి అప్పగించారు. తహసీల్దార్ ఇ.భాస్కరరావు, రాజాం తహసీల్దార్ పి. విజ యభాస్కర్ సమక్షంలో గోదాం తాళాలను యజమానికి శనివారం అందజేశారు. గోదాం అక్రమ నిర్మాణమంటూ రెండేళ్ల కిందట అధికారులు కూల్చివేశారు. దీంతో గోదాం యజ మాని కోర్టును ఆశ్రయించడంతో.. న్యాయమూర్తి ఆదేశాల మేరకు అప్పటి తహసీల్దార్ విజయ్‌భాస్కర్ సొంత నిధులతో గోదాం నిర్మించారు. ఎస్సై ఎ.నరేష్, డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, పాల్గొన్నారు.

ఆరోగ్య సిరి



పెదనడిపల్లి సమీపంలో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ్ చక్రవర్తి, తహసీల్దార్ సురేష్ తదితరులు(ఫైల్)

- జిల్లాలో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్
- చిరుధాన్యాలతో ఐదు రకాల ఆహార ఉత్పత్తులు
- జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో యూనిట్ నిర్వహణ
- చీపురుపల్లి మండలం పెదనడిపల్లిలో స్థలం గుర్తింపు
- ఎకరా స్థలంలో రూ.1.2 కోట్లతో డీపీఆర్ సిద్ధం
- స్థలాన్ని అప్పగిస్తూ రెవెన్యూశాఖ ఉత్తర్వులు



చిరుధాన్యాలు(ఫైల్)

జిల్లాలో 2022-23 రబీ సీజన్‌లో మండలాల వారీగా చిరుధాన్యాలు సాగు ఇలా...

మండలం	హెక్టార్లు	చీపురుపల్లి	60
రామభద్రపురం	40	గరివిడి	40
బొబ్బిలి	60	గుర్ల	100
తెర్లాం	60	మెరకముడిదాం	60
బాడంగి	40	నెలిమర్ల	40
రాజాం	740	కొత్తవలస	40
వంగర	220	జామి	20
సంతకవిటి	120	విజయనగరం	20
రేగిడి ఆమదాలవలస	140	భోగాపురం	40

చీపురుపల్లి:

జిల్లా ప్రజలకు ఆరోగ్య సిరి లభించనుంది. చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార ఉత్పత్తులు చౌకగా లభించనున్నాయి. ఓ వైపు ప్రజలకు బలవర్ధక ఆహారం అందించడం, మరోవైపు స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగానే ఇప్పటికే జిల్లాలోని గరివిడి, ఎస్.కోటలో ప్రారంభించిన మహిళా మార్ట్‌లు కార్పొరేట్ షాపింగ్ మాల్స్‌ను తలపిస్తున్నాయి. అదే కోవలో చిరుధాన్యాలతో ఆహార ఉత్పత్తులు తయారు చేసి వాటిని మార్కెటింగ్ చేస్తూ మహిళల్లో ఆర్థిక పరిపుష్టిని కలిగించాలనే లక్ష్యంతో చీపురుపల్లిలోని పెదనడిపల్లి గ్రామ సమీపంలో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. జిల్లా సమాఖ్య సారథ్యంలో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించింది.

సాగుకు ప్రోత్సాహం..

ప్రస్తుత కాలంలో చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార ఉత్పత్తుల వినియోగానికి ప్రజలు మొగ్గు చూపుతున్న విషయం తెలిసిందే. దీనికి అనుగుణంగా చిరుధాన్యాలు సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. రైతులకు రాయితీపై విత్తనాలు సమకూర్చుతోంది. సాగు ప్రోత్సాహకాలను అందజేస్తోంది. పంటకు మద్దతు ధర కల్పిస్తోంది. దీంతో 2022-23 రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 1843 హెక్టార్లలో చిరుధాన్యాలు సాగులో ఉన్నాయి.

ఎకరా స్థలంలో రూ.1.2 కోట్లతో యూనిట్

జిల్లాకు చెందిన మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చీపురుపల్లి మండలం పెదనడిపల్లిలో సర్వే నంబర్ 78/2లో ఎకరా ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థలాన్ని ఏపీ ఫుడ్ కార్పొరేషన్ అధికారులకు అప్పగించారు. ఈ స్థలంలో రూ.1.2కోట్ల వ్యయంతో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ఏపీ ఫుడ్ కార్పొరేషన్ అధికారులు డీపీఆర్ సిద్ధం చేశారు.

ఐదు రకాల ఆహార ఉత్పత్తులు

మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ నుంచి ఐదు రకాల ఆహార ఉత్పత్తులు తయారు చేసి మార్కెటింగ్ చేయనున్నారు. రెడీ టు ఈట్, రా మిల్లెట్ ప్రాసెసింగ్, కుర్‌కురే, న్యూడీల్స్, మిల్లెట్ బేకరీ వంటి ఆహార ఉత్పత్తులు తయారు చేస్తారు. వాటిని ప్యాకింగ్ రూపంలో సిద్ధంచేసి మార్కెట్‌లోకి పంపిస్తారు.

జిల్లా సమాఖ్య ద్వారా నిర్వహణ

ప్రభుత్వ స్థలంలో, ప్రభుత్వం నిధులతో ఏర్పాటు చేయనున్న మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లా సమాఖ్య ద్వారా నిర్వహించనున్నారు. స్వయం సహాయక సంఘాలకు యూనిట్ బాధ్యతలు అప్పగించి తద్వారా వచ్చే ఆదాయాన్ని మహిళలే తీసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. అదే కోవలో ఇప్పటికే గరివిడి, ఎస్.కోట మండలాల్లో మహిళా మార్ట్‌లు ఏర్పాటు చేసి ఆయా మండలాల్లో స్వయం సహాయక సంఘాల్లో ఉన్న ప్రతీ మహిళను ఆ మార్ట్‌లకు యజమానులను చేసింది.

యూనిట్ ఏర్పాటుకు చర్యలు



జిల్లాకు సంబంధించిన మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్‌ను చీపురుపల్లి మండలంలోని పెదనడిపల్లి గ్రామ పరిసరాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు పెదనడిపల్లి గ్రామంలో సర్వే నంబర్ 78/2లో ఎకరా ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. రెవెన్యూ శాఖ నుంచి స్థలాన్ని అప్పగించారు. త్వరలోనే యూనిట్ ఏర్పాటుచేసి చిరుధాన్యాలతో తయారుచేసిన ఆహార ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తాం. బయటమార్కెట్ కంటే తక్కువ ధరకే లభించనున్నాయి.

– కళ్యాణ్ చక్రవర్తి, పీడీ, డీఆర్‌డీఏ, విజయనగరం

మద్యం సీసాల సీజ్



మద్యం సీసాలను సీజ్ చేసిన ఎస్‌ఐ గంగరాజు



మద్యం బాటిళ్లు, పట్టుబడిన వ్యక్తులతో పోలీసులు

గజపతినగరం: మండలంలోని పాతశ్రీరంగరాజపురం గ్రామంలో అక్రమంగా మద్యం సీసా లు విక్రయిస్తున్న వి.తౌడమ్మను అదుపులోకి తీసుకొని కేసును నమోదు చేసినట్లు ఎస్‌ఐ గంగరాజు విలేకరులకు శనివారం తెలిపారు. అక్రమంగా మద్యం వ్యాపారాలు చేసినా, పేకాట, కోడి పందాలు, బెట్టింగ్‌లు నిర్వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అన్ని ప్రాంతాల్లో నిఘా పెట్టి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కేసులు బుక్ చేసి రిమాండ్‌కు తరలించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో ఇద్దరి అరెస్టు

మెంటాడ: మండలంలోని గుర్ల, తమ్మిరాజుపేట గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమంగా మద్యం తరలిస్తుండగా శుక్రవారం రాత్రి పట్టుకున్నట్టు ఆంద్ర ఎస్‌ఐ సిద్ధార్థ శనివారం తెలిపారు. పిట్టాడ కూడలి వద్ద 15సీసాలతో, తమ్మిరాజుపేట కూడలి వద్ద 10 సీసాలతో ఇద్దరు వ్యక్తులను పట్టుకొని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

మద్యం బాటిళ్లతో ఇద్దరి అరెస్టు

రాజాం సిటీ: పట్టణ పరిధి వస్త్రపురి కాలనీ, మెంటిపేట కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను శనివారం అరెస్టు చేశామని టౌన్ సీఐ కె.రవికుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి వారి నుంచి 19 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు వారిని అదుపులోకి తీసుకున్నామని అన్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చామని తెలిపారు.

నేవీ ఉద్యోగి ఆత్మహత్య



శ్రీనివాసరావు మృతదేహం

విజయనగరం క్రైమ్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక నేవీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి రూరల్ పోలీసులు శనివారం అందించిన వివరాలిలా ఉన్నా యి. ఇండియన్ నేవీలో ఉద్యో గం చేస్తున్న కె.శ్రీనివాసరావు (27) రెండు రోజులుగా విధు లకు సెలవు పెట్టి జొన్నవలసలో తన స్వగృహం వద్దనే ఉన్నాడు. తల్లిదండ్రులిద్దరూ ఉపాధి కూలీలు. శుక్రవారం ఉదయం 9.30 గంటల వరకూ బాగానే ఉన్నాడు. కూలి పనులకు వెళ్లిన తల్లిదండ్రులు తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులు వేసి ఉండడంతో పలుమార్లు పిలిచినప్పటికీ పలకకపోవడంతో స్థానికుల సహాయంతో తలుపులు బద్దలుకొట్టి లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కి ఉరి వేసుకుని కనిపించడంతో తల్లి దండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆర్థిక ఇబ్బందులు, గత కొంత కాలంగా మానసికంగా ఇబ్బందులు పడుతున్నాడని తల్లిదండ్రులు పోలీసులకు వివరించారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. తండ్రి కెంగువ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూ రల్ ఎస్‌ఐ బి.గణేష్ తెలిపారు.

ప్రైవేటు ఆస్పత్రులపై కొరడా

- రిజిస్ట్రేషన్ లేకుంటే కఠిన చర్యలు
- వైద్య శాఖ అనుమతి లేని రెండు క్లినిక్‌లకు నోటీసుల జారీ
- జిల్లాలో రిజిస్టర్ అయిన ప్రైవేటు ఆస్పత్రులు 307
- ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు 91
- ప్రభుత్వ స్కానింగ్ కేంద్రాలు 14

వైద్య ఆరోగ్య శాఖ అనుమతి లేకుండా నిర్వహించే ప్రైవేటు క్లినిక్‌లు, స్కానింగ్ కేంద్రాలు, లాబొరేటరీలపై సంబంధిత శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అనుమతి లేని వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. అలాగే రెన్యువల్ చేసుకోని వారికి కూడా నోటీసులు ఇస్తున్నారు. తద్వారా ప్రజారోగ్యానికి భరోసా కల్పించేందుకు చర్యలు చేపట్టారు.



పట్టణంలో ఓ ఆస్పత్రులో చికిత్స పొందుతున్న రోగులు

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్య శాఖ వద్ద రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లపై వైద్యాధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. వైద్య శాఖ అనుమతి తీసుకోవాలని పలుమార్లు చెప్పినప్పటికీ పట్టించుకోకుండా క్లినిక్‌లు, ఆస్పత్రులు నిర్వహిస్తున్న రెండు క్లినిక్‌లకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నోటీసులు ఇచ్చారు. రెన్యువల్ చేయించుకోని ఆస్పత్రులకు కూడా రెన్యువల్ చేసుకోవాలని నోటీసులు ఇస్తున్నారు. దీంతో రెన్యువల్ చేయించుకోవడానికి, రిజిస్టర్ చేసుకోవడానికి ఆస్పత్రులు ముందుకు వస్తున్నారు. జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఆస్పత్రులతో పాటు లాబొరేటరీలు కూడా ఇబ్బడిముబ్బడిగా పుట్టుకొస్తున్నాయి. వీరిలో కొందరు అనుమతులు తీసుకుంటుంటుగా, కొందరు ఎటువంటి అనుమతులు లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో రిజిస్ట్రేషన్ అయిన ఆస్పత్రుల వివరాలు

జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ వద్ద ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు 120 రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. క్లినిక్‌లు 80 రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. డయోగ్నోస్టిక్ సెంటర్లు 51 ఉన్నాయి. డెంటల్ క్లినిక్‌లు 48 ఉన్నాయి. ఫిజియోథెరపి క్లినిక్‌లు 8 ఉన్నాయి. అదేవిధంగా ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు 91 ఉన్నాయి. ప్రభుత్వ స్కానింగ్ సెంటర్లు 14 ఉన్నాయి. ఇవన్నీ రిజిస్ట్రేషన్ చేసుకున్నాయి. రిజిస్ట్రేషన్ లేకుండా ఇంకా కొందరు ఆస్పత్రులు, క్లినిక్‌లు, లాబొరేటరీలు నిర్వహిస్తున్నారు. వీరిపై చర్యలకు అధికారులు ముందడుగు వేశారు.

వైద్య శాఖలో రిజిస్ట్రేషన్ ఫీజుల వివరాలు

క్లినిక్ అయితే ఏడాదికి రూ.250 చొప్పున ఐదేళ్లకు సరిపడ ఫీజు రూ.1250 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. పాలీ క్లినిక్ అయితే ఐదేళ్ల రూ.2500 ఫీజు చెల్లించాలి. లాబొరేటరీలు అయితే ఏడాదికి రూ.500 చొప్పున ఐదేళ్లకు రూ.2500 చొప్పున చెల్లించాలి. నర్సింగ్ హోంలు రూ.750 చొప్పున ఐదేళ్లగా రూ.3750 చెల్లించాలి. 20 పడకలు ఉంటే ఏడాదికి రూ.1500 చొప్పున ఐదేళ్లకు రూ.7500 చెల్లించాలి. 50 పడకలు దాటితే ఏడాదికి రూ.రెండు వేలు చొప్పున ఐదేళ్లకు రూ.పది వేలు చొప్పున చెల్లించాలి.

అనుమతులు ఉండాల్సిందే..

వైద్య ఆరోగ్య శాఖ అనుమతి లేకుండా ఆస్పత్రులు, క్లినిక్‌లు, లాబొరేటరీలు నిర్వహించడానికి లేదు. అటువంటి రెండు క్లినిక్‌లకు నోటీసులు ఇచ్చాం. రెన్యువల్ చేసుకోని వారికి కూడా రెన్యువల్ చేసుకోవాలని నోటీసులు జారీ చేశాం. ఆన్‌లైన్ ద్వారా వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు.

– డాక్టర్ ఎస్‌వీరమణకుమారి, డీఎంహెచ్‌ఓ

సీనియర్స్, అండర్ -23 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక రేపు

- జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజు

విజయనగరం: విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న సీనియర్స్, అండర్ - 23 విభాగాల్లో జిల్లా స్థాయి క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు శనివారం తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటలకు విజయనగరంలోని సర్ విజ్జీ స్టేడియంలో ఎంపిక పోటీలను ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు వైట్ డ్రెస్, సొంత క్రికెట్ కిట్‌తో పాటు విజయనగరం జిల్లాలో జన్మించినట్లు జనన ధ్రువీకరణ పత్రం, విజయనగరం జిల్లాలో చదువుతున్నట్లు స్టడీ సర్టిఫికెట్, ఆధార్ వెంట తీసుకు రావాలని సూచించారు. అండర్ - 23 ఎంపికకు హాజరయ్యే అభ్యర్థులు 2000 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని మరిన్ని వివరాలకు 9666818126 నంబరును సంప్రదించాలని పేర్కొన్నారు.

కమనీయం కోదండరాముడి కల్యాణం



సీతారామస్వామికి తలంబ్రాల సేవను జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం బోడికొండపై కోదండ రామాలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా దేవస్థాన అర్చకులు శనివారం స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వైఖాసన ఆగమోక్తంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా కోదండ రాముడికి ప్రాతఃకాల పూజలు చేపట్టిన అనంతరం ఉదయం విశ్వక్సేనారాధన, పుణ్యాహావచనం, అష్ట కలశ స్నపన మహోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం సీతారామస్వామిని పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించి కల్యాణ ఘట్టాన్ని ప్రారంభించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణ నడుమ జీలకర్ర, బెల్లం చూపించి.. స్వామి కల్యాణాన్ని వేడుకగా జరిపించారు. అనంతరం కర్పూర దండలను అలంకరించి తలంబ్రాల సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ కిషోర్‌కుమార్, అర్చకులు నరిసింహాచార్యులు, కిరణ్‌కుమారాచార్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోగొట్టుకున్న కెమెరా అందజేసిన పోలీసులు



రమేష్‌కు కెమెరాను అందజేస్తున్న రూరల్ సీఐ తిరుపతిరావు

విజయనగరం క్రైమ్: స్థానిక ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతూ కెమెరామెన్‌గా పార్ట్ టైమ్ జాబ్ చేస్తున్న ఆదారి రమేష్ కళాశాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో ఐనాడ జంక్షన్ వద్ద ఆటో ఎక్కి ఆటోలో రూ.లక్ష విలువైన తన కెమెరాను మర్చిపోయారు. తర్వాత కెమెరా మర్చిపోయానని గుర్తించిన రమేష్ వెంటనే రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ టీవీ.తిరుపతిరావు, ఎస్‌ఐ బి.గణేష్, కానిస్టేబుల్ రామ్మోహన్‌తో కలిసి సీసీ ఫుటేజీలు తనిఖీ చేసి ఆటోను గుర్తించి కెమెరాను కనిపెట్టారు. ఈ మేరకు శనివారం రూరల్ సర్కిల్ కార్యాలయంలో రమేష్‌కు కెమెరాను అందజేశారు. దీంతో రమేష్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమ సమాజ నిర్మాణమే అంబేడ్కర్ లక్ష్యం



జ్ఞాపికలతో నృత్య ప్రదర్శన విద్యార్థులు

విజయనగరం అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లక్ష్యం సమ సమాజ నిర్మాణమని, దాన్ని దేశానికి ఆయన రచించిన రాజ్యాంగం ద్వారా ప్రపంచానికి తెలియజేశారని ప్రముఖ సాహితీవేత్త జీఎస్‌చలం అన్నారు. గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు సంబంధించిన శనివారం జరిగిన సదస్సులో పలువురు వక్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో వేదాలను, పురాణాలను ఉదహరిస్తూ వాగ్గేయకారుడు అన్నమయ్య కీర్తనలలో సహితం అన్ని జీవులు సమానం అని చెబుతాయని అన్నారు. పోతులూరి వీరబ్రహ్మం కాళికాంబ శతకంలోనూ వేమన తన పద్యాలలోనూ కుల, మత విపక్షలను ఖండించారని అన్నారు. గురజాడ విజ్ఞాన కేంద్ర నిర్వాహకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయురాలు కె.శ్రీదేవి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఇండియన్ సైకాలజిస్టు అసోసియేషన్ సహాధ్యక్షుడు డాక్టర్ ఏవీ రాజశేఖర్, పలువురు ఉపాధ్యాయులు చుక్క తిరుపతినాయుడు, వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. తొలిత గాజులరేగ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు రూపొందించిన లఘు నాటికలు, 'బ్రహ్మ మొక్కటే... పర బ్రహ్మమొక్కటే...' అనే నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళా ప్రదర్శనలో ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు.

సైబర్ నేరానికి పాల్పడిన ముగ్గురి అరెస్టు



సైబర్ నేరగాళ్లను విలేకరుల ఎదుట హాజరుపర్చి వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉపేంద్ర

- గతంలో ఒకరి అరెస్టు– రూ.4.60 లక్షల నగదు రికవరీ

రాజాం సిటీ: సైబర్ నేరానికి పాల్పడిన వ్యక్తులను సంతకవిటి పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేసి వారి నుంచి నగదు రికవరీ చేశారు. శనివారం సైబర్ నేరగాళ్లను విలేకరుల ఎదుట హాజరుపరుస్తూ దీనికి సంబంధించిన వివరాలను రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర వెల్లడించారు. గత ఏడాది జూలై నెలలో జీఎంఆర్ ఐటీలో ఉద్యోగం చేస్తున్న ప్రొఫెసర్ సైబర్ నేరగాళ్ల వలలో పడి ఏకంగా రూ. 5.09 లక్షలు పోగొట్టుకుని పోలీసులను ఆశ్రయించాడు. రాజాంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో పని చేస్తున్న ప్రొఫెసర్ నేరగాళ్లు మెయిన్‌ను యాక్ చేశారు. దీని ద్వారా తన యాక్సిస్ బ్యాంకుకు లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే బ్యాంకు అధికారులు సైతం లోన్‌ను మంజూరు చేయడంతో తన ఫోన్‌కు రూ. 4.90లక్షలు రుణం మంజూరైనట్లు మెసేజ్ వచ్చింది. ఇది చూసి విస్తుపోయిన తను లోన్‌కు దరఖాస్తు చేయకుండానే ఎందుకు వచ్చిందని అదే నంబర్‌కు ఫోన్ చేశాడు. మీకు ఓటీపీ పంపిస్తామని అది చెబితే మీ రుణాన్ని రద్దు చేస్తామని చెప్పిన సైబర్ నేరగాళ్లు ఏకంగా ప్రొఫెసర్ ఖాతాలో నుంచి లోన్ రుణం రూ.4.90 లక్షలతో పాటు అతని సొంత సొమ్ము రూ.19వేలతో కలిపి రూ. 5.09 లక్షలు మాయం చేసి వేర్వేరు ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ చేశారు. దీంతో తాను మోసపోయానని గుర్తించిన ప్రొఫెసర్ సోల్మాన్ సంతకవిటి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిని ఛాలెంజింగ్‌గా తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో సైబర్ నేరగాళ్లు ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్ నగర్ జిల్లా బుధాన్ మండలం బుదవరా గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులుగా గుర్తించారు. వీరిలో ఒక వ్యక్తి ఏటీఎం నుంచి నగదు విత్‌డ్రా చేసిన సుమిత్ అనే వ్యక్తిని అరెస్టు చేసి మిగిలిన వారి వివరాలు ఆరా తీశామని అన్నారు. అదే గ్రామానికి చెందిన సచిన్‌కుమార్, మనీష్ కుమార్, రవికుమార్‌లతో కలసి ఈ నేరం చేశామని సుమిత్ కుమార్ తెలిపాడని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న సదరు ముగ్గురు వ్యక్తులు గ్రామం నుంచి పరారైనట్లు గుర్తించినప్పటికీ వారిపై నిఘా ఉంచామని వెల్లడించారు. గ్రామంలోని వ్యక్తుల ద్వారా వారి వివరాలు సేకరించి ఈ నెల 10న ఉత్తరప్రదేశ్ వెళ్లి వారి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి నుంచి నేరంలో పోయిన రూ. 4.69 లక్షలకు రూ. 4.60 లక్షలు రికవరీ చేశామని చెప్పారు. గతంలో రూ. 5.09 లక్షలు పోయినప్పటికీ రూ. 40వేలు మళ్లీ ప్రొఫెసర్ ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. నేరస్తులు పట్టుకోవడానికి కృషి చేసిన ఎస్‌ఐ ఆర్.జనార్దనరావు, కానిస్టేబుల్ వై.రామరాజు, నర్సింగరావులను అభినందించారు.